

ఉరేసుకున్న సోలిపేట సురేందర్‌రెడ్డి



సిద్దిపేట జిల్లా చిట్టాపూర్‌లో కూలిపోయిన స్థితిలో సురేందర్‌రెడ్డి ఇల్లు



చిట్టాపూర్‌లో సురేందర్‌రెడ్డి వ్యవసాయ పొలం

# ఇంకెందరు రైతులు బలికావాలి?

- రుణమాఫీలో సర్కార్ ఫెయిల్
- రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య కలిచివేసింది
- ఇప్పటికైనా రైతులందరికీ రుణమాఫీ చేయాలి
- కేసీఆర్ పాలనలో తగ్గిన రైతు ఆత్మహత్యలు: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తేతెలంగాణ): 'మీ సర్కారు వైఖరి వల్ల ఇంకా ఎంతమంది రైతులు బలికావాలి? ఎంతకాలం బాధలు భరించాలి? ఈ బాధలు పడొద్దనే కదా, పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నది' అని కాంగ్రెస్ సర్కారుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రుణమాఫీ కాలేదన్న వేదనతో రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీ విషయంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా ఇంకా ఎంతమంది రైతులు ఆత్మహత్య లు చేసుకోవాలని ప్రశ్నించారు. రైతులు ఇలాంటి బాధలు పడొద్దనే తెలంగాణ పోరు జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతు రుణమాఫీ విషయంలో తమ వైఫల్యాన్ని ఒప్పుకొని, ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. స్ఫూర్తిదాయకమైన విధానాలతో రైతు ఆత్మహత్యలు లేని తెలంగాణను కేసీఆర్ సృష్టించారని పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గుదల, తృణధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామికి ఎదిగిన రాష్ట్ర వ్యవసాయ ముఖచిత్రాన్ని గ్రాఫ్ రూపంలో పేర్కొన్నారు. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం 2015లో 11.1 శాతం ఉన్న రైతు ఆత్మహత్యలు 2022 వచ్చేసరికి 1.57 శాతానికి తగ్గిన గ్రాఫ్‌ను, 2015లో కేవలం 2.1 శాతం ఉన్న తృణధాన్యాల ఉత్పత్తి 2022 నాటికి 6.85 శాతానికి పెరిగిన వైనాన్ని ఉదహరించారు.

### 25 లక్షల చొప్పున పరిహారం ఎందుకివ్వరు?

భారీ వర్షాలు, వరదల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునే విషయంలో ప్రభుత్వం మౌనం వీడాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు 25 లక్షల చొప్పున పరిహారం ఎందుకు పంపిణీ చేయరని ప్రశ్నించారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో మరణించిన వారి వివరాలు వెల్లడించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 31 మంది మరణిస్తే కేవలం 16 మంది మృతి చెందారని ప్రభుత్వం ఏ విధంగా లెక్కగట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా మరణించిన 31 మంది వివరాలను ఆయన పేర్లతో సహా విడుదల చేశారు.

### కాళోజీ కళాకేంద్రం.. కేసీఆర్ ఇచ్చిన శాశ్వత నివాళి

ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీకి కేసీఆర్ శాశ్వత నివాళి ఇచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. కాళోజీ చావు, పుట్టుక మధ్య జీవితమంతా తెలంగాణదేనన్నారని పేర్కొన్నారు. ఆ మహనీయుడి కీర్తిని తెలంగాణ సమాజం గుర్తుంచుకునేలా సెప్టెంబర్ 9న కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకొన్నామని తెలిపారు. హెల్త్ వర్సిటీకి కాళోజీ పేరు పెట్టిన విషయాన్ని ఉదహరించారు. వరంగల్‌లో కాళోజీ కళాకేంద్ర నిర్మాణం భవిష్యత్తు తరాల వారధిగా ఉండేలా కేసీఆర్ రూపకల్పన చేశారని, ఆ కేంద్రం నిర్మాణ దృశ్యాలను కేటీఆర్ ఎక్స్‌వేదికగా పంచుకున్నారు.

# ..పోయింది రైతన్న ప్రాణం

మొదటిపేజీ తరువాయి...

విషాదఛాయలు అలుముకున్నాయి. చిట్టాపూర్ గ్రామానికి చెందిన సోలిపేట ప్రతాప్‌రెడ్డి, సుశీల దంపతులకు రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి కుమారులు. వీరికి పదెకరాల పొలం ఉండగా, దశాబ్దాల కిందటే వివాహాలైన వీరు వేర్వేరుగా నివాసాలు ఉంటున్నారు. గతంలోనే ఇద్దరు కొడుకుల పేరిట చెరో నాలుగెకరాల పొలం, తల్లి సుశీల పేరిట రెండెకరాలు ఉన్నది. పదేండ్ల కిందట సాగునీటి సమస్యతో రెండు కుటుంబాలు గ్రామం విడిచి వలస వెళ్లారు. పెద్ద కొడుకు రవీందర్‌రెడ్డి బొల్లారంలో, సురేందర్‌రెడ్డి మేడ్చల్‌లో తమ కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. వారి తల్లి సుశీల ఇద్దరు కొడుకుల వద్ద ఉంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించడంతో సురేందర్‌రెడ్డి సంతోషపడ్డారు. రుణమాఫీ కోసం నెల రోజులుగా తన స్వగ్రామమైన చిట్టాపూర్‌కు వచ్చి వెళ్తున్నాడు. రుణమాఫీ మూడు విడతల జాబితాల్లో సురేందర్‌రెడ్డి పేరు రాలేదు. అతని అన్న రవీందర్‌రెడ్డికి మాఫీ అయ్యింది. తనకు ఎందుకు కాలేదని ఆరాతీశాడు. ఇందుకు కారణం సురేందర్ రెడ్డి రేషన్‌కార్డులో తన తల్లి సుశీల ఉండటమేనని అధికారులు చెప్పడంతో విస్తుపోయాడు.

### చిట్టాపూర్ ఏపీజీవీబీలో పంట రుణాలు

సుశీల సహా ఇద్దరు కొడుకులకు చిట్టాపూర్ ఏపీజీవీబీలోనే పంట రుణ ఖాతాలు ఉన్నాయి. సుశీలకు రెండెకరాల పాస్‌బుక్‌పై రూ.1,15,662 పంట రుణం ఉండగా, రవీందర్‌రెడ్డికి నాలుగెకరాల పాస్ పుస్తకంపై రూ.1.60 లక్షల రుణం ఉన్నది. సురేందర్‌రెడ్డికి నాలుగెకరాల పాస్ పుస్తకంపై రూ. 1,92,443 రుణం ఉన్నది. వీరిలో రవీందర్‌రెడ్డికే రుణమాఫీ అయ్యింది. నాలుగురోజుల క్రితం రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి కలిసి ఏపీజీవీబీలో రుణమాఫీ గురించి మేనేజర్‌ను అడిగారు. సురేందర్‌రెడ్డికి ఆయన తల్లికి ఒక్కటే రేషన్‌కార్డు ఉన్నందున రుణమాఫీ కాలేదని బ్యాంకు మేనేజర్ అనిరుధ్ చెప్పారు. రేషన్‌కార్డులో ఉన్న కుటుంబసభ్యులకు 2 లక్షలు మాత్రమే మాఫీ అవుతుందని చెప్పడంతోపాటు మిగతా డబ్బులు చెల్లించాల్సిందేనని సూచించారు. మానసికంగా కలత చెందిన సురేందర్‌రెడ్డి గురువారమే మేడ్చల్ వెళ్లాడు. రుణమాఫీ జరగలేదని కుటుంబసభ్యులకు చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు.

### రైతుకు ఉరిపోసిన రేషన్‌కార్డు నిబంధన


రైతు పాస్ పుస్తకం ప్రాతిపదికన రుణమాఫీ జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ రేషన్‌కార్డు ఆధారంగానే మాఫీ అమలైంది. ఇదే సురేందర్‌రెడ్డి ఉసురు తీసింది. సురేందర్‌రెడ్డి ఆత్మహత్యకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని గ్రామస్థులు తెలిపారు. పదేండ్ల కిందట కాంగ్రెస్ సర్కారు ఉన్నప్పుడు సాగునీరు లేక సాగు సాధ్యం కాక ఉపాధి కోసం కుటుంబంతో కలిసి మేడ్చల్‌కు వలస వెళ్లాడని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పంట రుణమాఫీ జాబితాలో సురేందర్‌రెడ్డి పేరు రాలేదని ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేసుకుంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి గాంధీ దవాఖానకు వెళ్లి సురేందర్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైతు కుటుంబానికి రేవంత్‌రెడ్డి సర్కార్ రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### 2500 మంది రైతులకే మాఫీ


చిట్టాపూర్ ఏపీజీవీబీలో 3,400 మంది రైతులు రుణాలు తీసుకోగా 2,500 మంది రైతులకు రూ. 20.53 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. మిగతా 900 మందికి మాఫీ కాలేదని బ్యాంకు అధికారులు వెల్లడించారు.

## ఏవో కార్యాలయంలో విగతజీవుడై..

**ఇంటి** నుంచి గురువారం బయటకు వెళ్లిన సురేందర్‌రెడ్డి శుక్రవారం తెల్లవారుజామున మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో విగతజీవుడై కనిపించాడు. కార్యాలయ ఆవరణలోని ఇనుప మెట్లకు తాడు కట్టి.. మెడకు బిగించుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచా రం ఇచ్చారు. మృతదేహంపై ఉన్న ఎస్బీఐ ఏటీఎం స్లిప్పులను పోలీసులు గుర్తించారు. ఒక స్లిప్‌లో 'నా చావుకు కారణం క్రాప్‌లోన్. చిట్టాపూర్ బ్యాంకులో రుణమాఫీ కాలేదని ఆత్మహత్య' అని కింద మూడు ఫోన్‌నంబర్లు రాశాడు. మరో స్లిప్‌లో 'నా చావుకు కారణం నా అమ్మ' దాని కిందనే మరోసారి చిట్టాపూర్ బ్యాంకులో క్రాప్‌లోన్ మాఫీ కాలేదని ఆత్మహత్య' అని రాశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలాన్ని ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. తల్లికి, తనకు ఒకటే రేషన్‌కార్డు ఉన్నందున రుణమాఫీ కానందుకే సురేందర్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్టుగా తెలుస్తున్నదని పోలీసులు చెప్పారు.




సూసైడ్ నోట్




నేను గణేశ గణన చేపడుతున్నా స్వామీ!

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 35.0°c | 24.1°c |
| మెదక్ | 34 .4°c | 22.2°c |
| రంగారెడ్డి | 33.2°c | 21.7°c |
| ఖమ్మం | 32.0°c | 24.0°c |
| కరీంనగర్ | 31.0°c | 26.0°c |
| నల్లగొండ | 30.5°c | 23.4°c |
| హైదరాబాద్ | 30.8°c | 22.9°c |
| మహబూబ్‌నగర్ | 30.0°c | 22.0°c |
| నిజామాబాద్ | 29.0°c | 23.4°c |
| వరంగల్ | 28.0°c | 25.0°c |



వరంగల్ జేపీఎన్ రోడ్డులోని కెనరా బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

## రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పాలి

పురుగు మందు డబ్బాలతో రైతుల ఆందోళన

గిర్మాజీపేట, సెప్టెంబర్ 6: అర్హులైన తమకు రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పాలని రైతులు శుక్రవారం వరంగల్ జేపీఎన్ రోడ్‌లోని కెనరా బ్యాంకు ఎదుట పురుగుల మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు దేవుళ్ల మీద దొంగ ఒట్లు పెట్టి ఇప్పుడు రుణమాఫీకి అనేక కొర్రీలు పెడితే మూకుమ్మడిగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# వానలు, వరదల్లో అసమతుల్యత

- గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం వల్లే
- 90 రోజుల్లో 75 రోజులు వానలే
- వర్షాలు కురిసినా నిండని చెరువులు
- తక్కువ రోజులు వర్షాలు పడ్డ చోట ఎక్కువ వర్షపాతం నమోదు
- ఇండో-జర్మన్ క్లైమేట్ చేంజ్ ప్రాజెక్టు చైర్మన్,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేశ్ ఆందోళన

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): గ్లోబల్ వార్మింగ్ (భూతాపం)తోపాటు కాలుష్యం పెరగడంతో వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుని వానలు, వరదల్లో అసమతుల్యత చోటు చేసుకుంటున్నది. ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్న పరిస్థితులే ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలో కొన్ని రోజుల నుంచి కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వానలు బీభత్సం సృష్టించాయి. 31 జిల్లాల్లో సాధారణ స్థాయి కంటే 41% అదనపు వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 6 వరకు 608.7 మి.మీ. వాన కురువాల్సి ఉండగా.. శుక్రవారం నాటికి 855.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన నాటి నుంచి 90 రోజుల్లో ఏకంగా 75 రోజులు వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఈ వానల్లో గతంలో ఎన్నడూ లేని వ్యత్యాసాన్ని వాతావరణ నిపుణులు గుర్తించారు. ఎక్కువ రోజులు వాన కురిసిన ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం.. తక్కువ రోజులు వాన కురిసిన చోట ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఎక్కువ వర్షాలు కురిసిన చోట చెరువులు, జలాశయాలు నిండలేదు. రాష్ట్రంలోని 34,716 చెరువుల్లో 65% మాత్రమే నిండడంపై ఇండో-జర్మన్ క్లైమేట్ చేంజ్ ప్రాజెక్టు చైర్మన్ చెన్నమనేని రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు.

> **వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ వల్లే ..**
>
> 
>
> రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అధికంగా, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువగా వర్షాలు కురవటానికి గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు, కాలుష్యం పెరిగిపోవడం, వ్యవసాయంలో పురుగు మందుల వినియోగం అధికమవడమే ప్రధాన కారణం. వీటి వల్ల ఒకే ప్రాంతాల్లోగా వానలు కురుస్తున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతున్నది. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు ప్రజలతోపాటు వాతావరణ సంస్థలు అప్రమత్తం కావాల్సిన అవసరమున్నది.
>
> **- ఇండో-జర్మన్ క్లైమేట్ చేంజ్ ప్రాజెక్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్**

### 6 వేల చెరువుల్లో సగం కూడా నిండని నీళ్లు

రాష్ట్రంలోని 6 వేల చెరువుల్లో నీటిమట్టం సగానికి కూడా పెరగలేదు. 2,200 చెరువుల్లో పావు వంతు నీళ్లు ఉన్నాయి. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల్లో 50% అధికంగా వానలు కురిసినప్పటికీ ఆ జిల్లాల పరిధిలోని 2,559 చెరువుల్లో కనీసం 40% కూడా నిండలేదు. మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం 1,800 చెరువులు పొంగిపొర్లుతున్నాయి. మరో 340 చెరువులు నిండాల్సి ఉన్నది.

## అన్నదాతలూ.. ధైర్యం కోల్పోకండి!

**మాజీ మంత్రులు హరీశ్, మల్లారెడ్డి వినతి**

**రైతు సురేందర్‌రెడ్డికి నివాళి**

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): అన్నదాతలారా.. రుణమాఫీ కాలేదని ధైర్యాన్ని కోల్పోవద్దని మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. రుణమాఫీ కాలేదని ఆత్మహత్య చేసుకున్న సిద్దిపేట రైతు సురేందర్‌రెడ్డి మృతదేహం ఉన్న గాంధీ దవాఖాన మార్చురీ వద్ద శుక్రవారం నివాళులర్పించారు. రుణమాఫీ కాలేదనే మనస్తాపంతో రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేసేవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. సీఎం తప్పుడు ప్రకటనలు, బుకాయింపులతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారని చెప్పారు. మ్యానిఫెస్టోలో చెప్పినట్టు రైతులందరికీ రుణమాఫీ చేసే దిశగా బాధ్యతగా వ్యవహరించాల్సిందిగా సీఎంకు హితవు పలికారు. మాఫీ విషయంలో రేవంత్ రెడ్డి నిర్దేశించుకున్న గడువు ముగిసి నెల కావస్తున్నదని, ఇప్పటికైనా కండ్లు తెరిచి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని హరీశ్‌రావు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బంగారం లాంటి తెలంగాణను అతలాకుతలం చేశారన్నాని ఎమ్మెల్యే మల్లారెడ్డి విమర్శించారు. రుణమాఫీ కాలేదని మేడ్చల్‌లో రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రైతులంతా ఆనందంగా ఉన్నారని, నాడు దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.



నల్లగొండ జిల్లా త్రిపురారం రైతు వేదిక ఎదుట రైతులతో కలిసి ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## రుణమాఫీ చేయాలని త్రిపురారంలో రైతుల ధర్నా

త్రిపురారం, సెప్టెంబర్ 6 : షరతులు లేకుండా రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నల్లగొండ జిల్లా త్రిపురారం రైతు వేదిక ఎదుట బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి అన్నదాతలు ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 35 శాతం రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్లలో పేర్లు తప్పు ఉన్నాయని, ఎక్కువగా ఉన్న వడ్డీ డబ్బులను చెల్లించాలని, లేనట్లయితే రుణమాఫీకి అర్హులు కాకుండా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రుణమాఫీపై అధికారులకు పూర్తి స్పష్టత లేదని, బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. రోజూ మండల కేంద్రానికి ఐదారు వందల మంది రైతులు వస్తున్నారని, వారి గోడును వినలేకే బీఆర్‌ఎస్ పార్టీ తరపున రైతుల పక్షాన ధర్నా చేపట్టినట్టు తెలిపారు.

## సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ ఇకలేరు

**అనారోగ్యంతో కన్నుమూసిన కవి • సంతాపం తెలిపిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తేతెలంగాణ) : ప్రముఖ కవి, సినీ గేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ(76) హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఇటీవల ఆటా వేడుకల్లో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన ఆయన, ఆరోగ్యం దెబ్బతినడంతో జూలై 16న హైదరాబాద్ దవాఖానలో చేరారు. వడ్డేపల్లి సిరిసిల్లలో ఓ చేనేత కుటుంబంలో జన్మించగా, హైదరాబాద్‌లోని నాగోల్‌లో స్థిరపడ్డారు. రెండ్రోజుల క్రితమే తెరసం ఆయనకు జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసింది.

వడ్డేపల్లి కృష్ణ మృతిపట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాహిత్య రంగంలో ఆయన సేవలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణ మృతికి కవులు, కళాకారులు, రచయితలు, సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

## ఇల్లు నీట మునిగిందని..

**గోదావరిలో దూకి కానిస్టేబుల్ ఆత్మహత్య**

**తండ్రి కష్టార్జితంతో కట్టుకున్న ఇల్లు..**

**రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ఆరోగ్యం**

**సెల్ఫీ వీడియో తీసుకుని బలవన్మరణం**



రమణారెడ్డి(ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం(నమస్తే తెలంగాణ)/బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 6 : 'నాన్న ఇన్నాళ్లూ కష్టపడి కట్టుకున్న ఇంటిని వరద ముంచింది. ఆ నష్టం ఎవరూ పూడ్చలేనిది. యాక్సిడెంట్‌లో దెబ్బతిన్న నా ఆరోగ్యం పూర్తిగా సహకరించడం లేదు. అనారోగ్యంతో భార్య ఆరోగ్యం కూడా క్షీణిస్తున్నది. ఇవన్నీ నాకే ఎందుకు జరుగుతున్నాయి? వీటిని నేను భరించలేను. ఇక చనిపోతున్నా' అంటూ కన్నీటిని దిగమింగుకుంటూ సెల్ఫీ వీడియో తీసుకున్న ఓ కానిస్టేబుల్ ఆ తర్వాత గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రతి ఒక్కరినీ కలిచివేసిన ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన 2000 బ్యాచ్‌కు కానిస్టేబుల్ రమణారెడ్డి(47) కొత్తగూడెం టూటౌన్ పరిధిలోని క్లూస్ టీం విభాగంలో పనిచేస్తున్నాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. రమణారెడ్డి తండ్రి సింగరేణిలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందాడు. పాల్వంచ వెంకటేశ్వర హిల్స్ కాలనీలో ఇల్లు కట్టుకున్నాడు. రమణారెడ్డి పాల్వంచలోని పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి అతడి తండ్రి ఇల్లు నీటిలో మునిగింది. నాన్న కష్టార్జితం నీట మునిగిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇటీవల భార్య అనారోగ్యానికి గురికావడం, కొడుకు బీటెక్ ఆపేసి ఇంటికి రావడం.. మళ్లీ చదివించడం వంటి ఘటనలతోపాటు కొత్తగూడెంలో పది రోజుల క్రితం లారీని ఢీకొనడంతో రమణారెడ్డి చేయి విరిగింది. ఇవన్నీ తన కుటుంబానికే రావడంతో శని తనను వెంటాడుతుందనే బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. తనను క్షమించాలని సెల్ఫీ వీడియోలో కుటుంబ సభ్యులను వేడుకోవడం మరింత వేదనకు గురిచేసింది. సమాచారం అందుకున్న సీఐ, ఎస్సై విజయలక్ష్మి, ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు.

# మాఫీ మాయ.. లక్ష పేర్లు గల్లంతు!

- అడుగడుగునా సర్కారు మాయాజాలం
- ప్రభుత్వ సర్వేలో లక్షల పేర్లు మాయం
- 31 సాంకేతిక సమస్యలు గుర్తింపు
- కేవలం రేషన్‌కార్డు సమస్యపైనే సర్వే

కరీంనగర్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి/హుస్నాబాద్‌టౌన్): రైతు రుణమాఫీ ఒక మాయగా మారింది. వ్యవసాయ శాఖ తాజా చేపట్టిన సర్వేలో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. సర్వే నిమిత్తం వ్యవసాయ శాఖ అధికారులకు పంపించిన జాబితాల్లో అన్ని అర్హతలు ఉండీ రుణమాఫీ కానీ లక్షలాది రైతుల పేర్లు గల్లంతయ్యాయి. దీంతో తమ పేర్లు, డాటా ఎందుకు కనిపించడం లేదో అర్థం కాక, తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక, అడిగినా ఎవరి నుంచీ స్పష్టత రాక లక్షలాది రైతులు ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నంలో రుణమాఫీ జరగలేదంటూ 1,400కుపైగా ఫిర్యాదులొచ్చాయి. ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖ అధికారులకు వచ్చిన రుణమాఫీ కాని జాబితాను ఫిర్యాదుదారుల ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసి వెరిఫై చేస్తే, 850కిపైగా రైతుల పేర్లకు సంబంధించిన డాటా 'నాట్ ఫౌండ్' అని చూపిస్తున్నది. రైతులు బ్యాంకుకు వెళ్లి అడిగితే.. అగ్రికల్చర్ అధికారులనే అడగాలని సమాధానమిస్తున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేట కెనరా బ్యాంకు శాఖ పరిధిలో వేయికిపైగా రైతుల పరిస్థితి ఇలానే ఉన్నది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కెనరా బ్యాంకు పరిధిలోని వందలాది రైతుల దుస్థితి ఇదే. ఒకటి రెండు బ్యాంకులో, ఒకటి రెండు గ్రామాల సమస్య మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా కొన్ని లక్షల మంది డాటా 'నాట్ ఫౌండ్' అని చూపిస్తున్నది.

### అసలేం జరిగింది?

తొలుత అందరికీ రుణమాఫీ చేశామని ప్రకటించిన ప్రభుత్వం, చివరకు రైతులు రోడ్లపైకి రావడంతో వాస్తవాన్ని అంగీకరించింది. క్షేత్రస్థాయి సర్వే చేయించి వారి వివరాలు నమోదు చేసి దశలవారీగా రుణమాఫీ వర్తింప చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా ఆగస్టు 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి మాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తారని ప్రభుత్వం చెప్పున్నప్పటికీ, అధికారులు మాత్రం ఇండ్లకు వెళ్లకుండా క్లస్టర్‌వారీగా రైతులను రైతువేదికల వద్దకు పిలుస్తూ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటికే 31 సాంకేతిక సమస్యల కారణంగా అందరికీ మాఫీ కాలేదని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో రుణమాఫీ కాని రైతుల కోసం సర్వే చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అందరి వివరాలు తీసుకుంటారని రైతులు భావించారు. కానీ, అలా జరగడం లేదు. సర్వే పేరిట ఒక యాప్ ఇవ్వడంతో పాటు ఒక జాబితాను ప్రభుత్వం పంపింది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులు.. ఆ జాబితాలో ఉన్న రైతుల వివరాలను మాత్రమే పరిశీలించి, ఫొటోలు తీసి స్వీయ ధ్రువీకరణ పత్రం తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ జాబితాను పరిశీలిస్తే, కేవలం రేషన్‌కార్డు అర్హత ఉండి, రుణమాఫీ జరగని రైతుల పేర్లతో కూడిన జాబితాను మాత్రమే ప్రభుత్వం పంపించినట్టు స్పష్టమవుతున్నది. 31 సాంకేతిక అంశాలతో సమస్యలు ఏర్పడి రుణమాఫీ జరగకపోతే, కేవలం రేషన్‌కార్డు సంబంధిత సమస్యను మాత్రమే ప్రస్తుత తాజా సర్వేలో పరిగణనలోకి తీసుకోవడం వల్ల.. మిగిలిన వారి పేర్లు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద ఉన్న జాబితాలో కనిపించడం లేదని తెలుస్తున్నది..

### మేమేం పాపం జేసినం



2018లో కెనరాబ్యాంక్ నుంచి రూ.లక్షన్నర అప్పు తీసుకున్న. సంవత్సరానికోసారి మిత్తి కట్టి రెన్యువల్ జేస్తున్న. అయినా నాకు రుణమాఫీ గాలేదు. ఏం పాపం సేసినమో అర్థం అయితలేదు. రోజూ బ్యాంకు సుట్టూ అగ్రికల్చర్ ఆఫీస్ సుట్టూ తిరుగుతునే ఉన్నం. అసలు మా పేర్లు ఎందుకు మాయమైందో ఎవరూ జెప్పడం లేదు.

**-దేవసాని శ్రీనివాసరెడ్డి, రైతు, పొట్లపల్లి, హుస్నాబాద్ మండలం**

### ఏదీ స్పష్టత?

**రుణమాఫీ** జరగలేదంటూ వస్తున్న ఫిర్యాదులను అధికారులు కొన్నిచోట్ల స్వీకరిస్తుండగా, మరికొన్ని చోట్ల తీసుకోవడం లేదు. దరఖాస్తులను ఏమి చేయాలన్న దానిపై ప్రభుత్వం అధికారులకు స్పష్టత ఇవ్వలేదు. రేషన్‌కార్డు యేతర సమస్యలతో రుణమాఫీ కాకుండా నిలిచిపోయిన రైతుల గురించి తిరిగి సర్వే చేస్తారా? లేదా? సదరు రైతులకు రుణమాఫీ వర్తింపచేస్తారా? లేదా? అనే ప్రశ్నలకు సమాధానం లభించడంలేదు. రుణమాఫీ వర్తించని రైతులందరికీ ఒకేసారి సర్వే చేసి.. వారి వివరాలు నమోదు చేసుకొని రుణమాఫీ వర్తింప చేయాలే తప్ప.. ఒకసారి రేషన్‌కార్డుతో కూడిన సమస్యలు.. మరోసారి మరో సమస్య అంటూ సర్వే చేసుకుంటూ వెళ్తే మరో మూడు నాలుగు నెలలకుపైగా సమయం పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.